క్లుప్తంగా

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

కొండపి: అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూపొందించిన డిజిటల్ బుక్‌ను నేడు ఆవిష్కరించనున్నట్లు మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపిలోని పొదిలి రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బుక్‌లో కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులను నమోదు చేసుకోవచ్చని, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరిని పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి మీద చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి పార్టీలో వివిధ హోదాలో ఉన్న నాయకులు, జెడ్పీటీసీ,వైస్ ఎంపీపీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు, అభిమానులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.మాధవరావు హెచ్చరించారు. ఆదివారం కంభం-కనిగిరి రహదారిలో వేములపాడు, హనుమంతునిపాడు సెంటర్లలో వాహనాలను తనిఖీ చేశారు. బండి కాగితాలు, డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలిన పీటీ



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

కొండపి: కొండపిలోని టంగుటూరు రోడ్ లోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఒక్కసారిగా భారీ శబ్దంతో పీటీ పేలిపోయింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలడంతో చుట్టు పక్కల ప్రజలందరూ ఒక్కసారిగా భయాందోళన చెందారు. వెను వెంటనే భారీ మంటలు రావడంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది సబ్ స్టేషన్‌కు వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పట్టపగలే ట్రాక్టర్ చోరీ

సింగరాయకొండ: పట్టపగలు దొంగలు రెచ్చిపోతున్నారు. మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో ట్రాలీతో సహా ట్రాక్టరు చోరీ అయిన ఘటన ఆదివారం మండల కేంద్రంలోని టీవీఎస్ షోరూమ్ సమీపంలో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. పాతసింగరాయకొండ పంచాయతీ ఎస్సీ కాలనీలో నివసిస్తున్న దన్నాసి కోటేశ్వరరావుకు చెందిన ట్రాక్టర్‌ను టీవీఎస్ షోరూమ్‌కు సమీపంలో ఆపి భోజనానికి వెళ్లాడు. భోజనం చేసి తిరిగి వచ్చి చూడగా ట్రాక్టరు లేకపోవటంతో వెంటనే ట్రాక్టరును వెతికే ప్రయత్నం చేశాడు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ట్రాక్టరు బస్టాండు వైపు వెళ్తున్నట్లుగా గ్రహించి వెతికామన్నారు. కాని ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో చివరికి రాత్రి 7 గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశామని వివరించారు.

మహాచండీదేవిగా వల్లూరమ్మ



మహాచండీ అవతారం వల్లూరమ్మతల్లి

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి శరన్నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు మహాచండీ దేవిగా వల్లూరమ్మ భక్తులకి దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి అమ్మవారి ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈఓ బి రమేష్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మూగ జీవాల.. దాహం వేదన !



జయవరం గ్రామంలో తొట్టెలో నీరు లేని దుస్థితి..



జమ్ములపాలెంలో నిర్వహణ లేక మురుగుతో ఉన్న తొట్టె



జమ్ములపాలెంలో నీటి కుంటలో నీరు తాగుతున్న గొర్రెలు

- గ్రామాల్లో నిరుపయోగంగా నీటి తొట్టెలు
- అవసరం లేకున్నా నిర్మిస్తున్న వైనం
- జిల్లాలో 1228 నీటి తొట్ల నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో నీటిలో ఉన్న నీటి తొట్టె

టంగుటూరు:

పశువుల దాహం తీర్చడానికి గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన నీటి తొట్లు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కరణంగా నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల అవసరం లేకున్నా పెద్దపెద్ద కుంటల్లో నిర్మించారు. ఉపయోగం లేని చోట నిర్మిస్తుండటంతో వర్షాకాలంలో వాటిలో మురికి నీరు చేరి తాగడానికి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. పొలాల్లోని కుంటలు, కాలువల్లో దాహం తీర్చుకునే జీవులు, తొట్లల్లో నీరు లేక, ఉన్న తొట్లల్లో మురుగు నీరు ఉండటంతో మూగ జీవాలు అల్లాడుతున్నాయి. నీటి తొట్లు టీడీపీ నేతలకు ఆదాయ వనరులుగా మారాయి. జిల్లాలో 1800 మంజూరు కాగా ఇప్పటి వరకు 1228 నీటి తొట్లు నిర్మిస్తే అవి కేవలం టీడీపీ సానుభూతిపరులు, అధికారులు తూతూమంత్రంగా మాత్రమే నిర్మించి జేబులు నింపుకున్నారు.

ఉపాధి హామీ నిధులతో నిర్మాణం..

ఉపాధి హామీ పథకం నిధులతో ఇంటిగ్రేట్ వాటర్ షేడ్ మేనేజిమెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఒక్కో నీటి తొట్టికి రూ. 35 వేలు వెచ్చించారు. జిల్లాలో ఒక్కో గ్రామంలో రెండు, మూడు చొప్పున మండలాని 15 తొట్లు నిర్మించారు. నిర్మించిన కొత్తలో కొన్ని గ్రామాల్లో వినియోగించుకోగా మరికొన్ని గ్రామాల్లో అసలు వినియోగానికే నోచుకోలేదు. ప్రస్తుతం వాటిని పట్టించుకోకపోవడంతో కొన్ని తొట్లు శిథిలమై పోగా మరి కొన్నింటిలో కంప చెట్లు మొలిచాయి. మరి కొన్ని రూపురేఖలు కోల్పోయాయి.

అయోమయంలో అధికారులు..

నీటి తొట్ల నిర్వహణ ఎవరు చేపట్టాలో తెలియని అయోమయ పరిస్థితిలో అధికారులు ఉన్నారు. వాటర్ షెడ్ పనులు నిలిపి వేసి సంవత్సరాలు గడిచిపోవడంతో నీటి నిర్వహణ ఎవరు నిర్వహించాలో తెలియడం లేదు. ప్రారంభంలో పశుసంవర్ధక శాఖ అధికారులు బాధ్యత తీసుకోగా పంచాయతీ పాలకులు నీటిని నింపేవారు. ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామా పశుకాపరులు, గ్రామస్తులు అంటున్నారు. దీంతో పశువులు కుంటల్లో చెరువుల్లో నీరు తాగాల్సిన పరిస్థితి వచ్చింది.

నీరుగారుతున్న లక్ష్యం..

టంగుటూరు సచివాలయ పరిధిలో టోల్ ప్లాజా సమీపంలో ఒక కుంటలో నిరుపయోగంగా నీటి తొట్టిని నిర్మించారు. కుంటలో నిండుగా నీరు ఉండటంఓ ప్రజలు అది చూసి ఇది కేవలం నిధులు దుర్వినియోగానికే అని చర్చించుకుంటున్నారు. అలాగే జయవరం సచివాలయం పరిధిలో చింత తోపులో నిర్మించిన నీటితొట్టి ఉపయోగం లేకున్నా నిర్మించి ప్రజా ధనం వృథా చేశారు. మండల కేంద్రాల్లో పరిస్థితి ఇలా ఉంటే శివారు గ్రామాల్లో ఏవిధంగా ఉంటుందో ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికైనా బాధ్యత గల అధికారులు స్పందించి పశువుల దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పశువుల దాహం తీర్చడం ఇబ్బందిగా ఉంది..

నీరు సక్రమంగా దొరక్క ప్రజలే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఎద్దులు, ఆవులు, మేకలు లాంటి మూగ జీవాల నీటి అవసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లను వినియోగం లోకి తెస్తే పశువులకు ఉపయోగంగా ఉంటుంది.

–షేక్ బాషా, గొర్రెల కాపరి, టంగుటూరు

టీడీపీ నేతలకు ఆదాయ వనరుగా మారింది..

గ్రామాలల్లో పశువుల దాహార్తి తీర్చడానికి నిర్మిస్తున్న మంచి నీటి తోట్లు టీడీపీ నేతలకు ఆదాయ వనరులుగా మారాయి. తొట్టి నిర్మాణానికి రూ. 35 మంజూరు కాగా రూ.15 నుంచి నుంచి రూ.20 వేలల్లోనే నిర్మిస్తున్నారు. నిర్మించిన నీటి తొట్ల నిర్వహణ ఎవరూ చేయడం లేదు.

–బుర్రా అంకరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు

బిల్లుల చెల్లింపులపై అధికారులు దృష్టిసారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలు, సైడుకాల్వలు, తాగునీటి వసతి పనులు, సచివాలయాలు, హెల్త్ సెంటర్స్, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు, విద్యుత్, వీధిలైట్ల మరమ్మతులు మొదలైన పనులు చేసిన కాంట్రాక్టర్లకు తక్షణం బిల్లుల చెల్లింపుపై అధికారులు దృష్టిసారించాలని వారిని ఇబ్బందులు పెట్టవద్దని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీఎస్‌పురం ఎంపీటీసీలు మన్నేపల్లి వెంకటసుబ్బమ్మ, బత్తుల రమాదేవిలు మాట్లాడుతూ సీఎస్‌పురంలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్‌శాఖాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అరివేముల సర్పంచ్ రాధారుక్మిణమ్మ, పుల్లగూరపల్లి సర్పంచ్ మొనపాటి భానుతేజ, అగ్రహారం సర్పంచ్ చీర్లదిన్నె రాధలు మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో తాము చేయించిన అభివృద్ధి పనుల బిల్లులు చేయడంలేదని, తమను వైఎస్సార్ సీపీ వారని ఇబ్బందులు పెడుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. తక్షణం పనులు చేసిన బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డికి, డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్యలకు సూచించారు. సీఎస్‌పురంలో పాఠశాల సమయంలో విద్యార్థులు బయట తిరుగుతూ వ్యసనాలకు గురవుతున్నారని ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించేలా చూడాలని ఎంఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, గోను సరస్వతి, ఎంపీటీసీ జాజుల తిరుపాలు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. వేదికపై ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఉగ్ర షిప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడి వేదికపైకి పిలవాలని సూచించగా ఎంపీపీ సొసైటీ అధ్యక్షుడికి ప్రొటోకాల్ లేదని తాను ఎంపీడీఓను అడగ్గా చెప్పారన్నారు. ఎక్కడ బిల్లులపై సభ్యులు ప్రశ్నిస్తారేమోనని ఎమ్మెల్యే మీరే సమావేశం నిర్వహించుకోండని డయాస్ దిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసయాదవ్, వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజనావెంకటరెడ్డి, సర్పంచ్‌లు ముత్యాలభారతీ నారాయణరెడ్డి, కోఆప్షన్ పఠాన్ మహబు, షేక్.ఖాదర్‌బీబుజ్జి, సీహెచ్. రాధాకృష్ణారెడ్డి, బొట్లా చిరంజీవి, ఎంపీటీసీలు గోను సరస్వతి, యం.వెంకటసుబ్బమ్మ, బి.తిరుపతిరెడ్డి, జె.తిరుపాలు, ఎం రామయ్య, పి.లలితమ్మ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాలాజీకి విశ్వనరుడు జాషువా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎంఈవో బాలాజీ

టంగుటూరు: విశ్వనరుడు జాషువా పురస్కారం టంగుటూరు మండల విద్యాధికారి మహతి బాలాజీని వరించింది. విశ్వనరుడు జాషువా సాహితీ సేవా సమాఖ్య, సత్తెనపల్లి వారు 26వ వార్షికోత్సవం, జాషువా 130వ జయంతి సందర్భంగా గుంటూరు రిటైర్డ్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఆర్ నరసింహారావు, ప్రకాశం జిల్లా విద్యాధికారి ఏ కిరణ్ కుమార్, సంస్థ అధ్యక్షుడు ముట్నూరి వెంకయ్య, ప్రముఖ సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బాలాజీకి పురస్కారం ప్రదానం చేశారు. కందుకూరులో మహతి సేవా సంస్థను స్థాపించి తన సొంత నిధులతో, సంస్థ ద్వారా కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, పద్య పఠన పోటీలు, పురస్కార ప్రదానాలు నిర్వహిస్తూ తెలుగు భాష, సాహిత్య సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు బాలాజీకి జాషువా పురస్కారం అందజేశారు.

మైనింగ్ చెక్‌పోస్టు ఏర్పాటు



కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఈనెల 1వ తేదీ నుంచి మైనింగ్ సీనరేజ్ వసూలుకు అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. మైనింగ్ సీనరేజ్ వసూలు చేయడానికి కూటమి ప్రభుత్వం నెల్లూరుకు చెందిన ఏఎంఆర్ సంస్థ అనుమతి ఇచ్చింది. దీంతో ఈ సంస్థకు సంబంధించి చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అయితే మండలంలో ఒక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారా లేక ఇంకా ఎన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నారో తెలియాల్సి ఉంది. ఈ ప్రాంతంలో ముఖ్యంగా గ్రావెల్, మట్టి, గుండ్రని రాయి రవాణా అవుతుంది. ప్రస్తుతం జిల్లా అధికారుల ఆదేశాలతో గ్రావెల్ రవాణా నిలిపి వేశారు. ఇప్పటివరకు తమ ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్ రవాణాదారులు రాత్రి పగలు తేడాలేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లలో గ్రావెల్, మట్టి, రాయి రవాణా చేసేవారు. ఈ తరుణంలో సీనరేజ్ వసూలుకు చెక్‌పోస్టు ఏర్పాటు చేయటం పట్ల గ్రావెల్ అక్రమ రవాణాదారులు కూటమి ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు.

జాషువాకు నాయకుల నివాళులు



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరిరూరల్: నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. ఆదివారం కనిగిరిలోని స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఓకే రెడ్డి, చింతగుంట్ల సాల్మన్ రాజు, కటికల వెంకటరత్నం, యక్కంటి శ్రీనివాసుల రెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, రాచపూడి మాణిక్యరావు, గూడూరి అబ్రహం లింకన్, షేక్ నాయబ్ రసూల్, అయిమల్ల నాగమణి, చీమలదిన్నే వెంగయ్య, పులి శ్రీనివాసరెడ్డి, నాలి వెంకటేశ్వర్లు, డబ్బుగొట్టు రవికుమార్ , చింతగుంట్ల కిషోర్, పలుకూరి భాస్కర్, ద్రోణాదుల చెంచులు, షేక్ పోలిచర్ల రహీం బాషా, దమ్ము వెంకటయ్య, దాసరి మురళి, సిగా కృష్ణారావు, షేక్ షకీల, రాచూటి సుస్మిత, మద్దిశెట్టి భారతి, లక్ష్మి నాయకులు పాల్గొని నివాళి అర్పించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉత్తమ ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న అతిథులు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసయాదవ్, ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఆదివారం ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న మండలంలోని డీజి పేట జెడ్పీహెచ్‌ఎస్ ఎస్ఏ జి.వెంకటేశ్వర్లు, ఎంపీపీఎస్ ఆనికాలపల్లి ఎస్‌జీటీ జె.భారతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, బొట్లా చిరంజీవి, పెరుగు సుబ్బరామయ్య, మన్నేపల్లి పెద్దన్న, పులిమి ఆదినారాయణ ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సంస్థ కమిటీ సభ్యులు

పామూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు కే.రామిరెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కందుకూరు రోడ్డులోని హిందూ శ్మశానంలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏడాదికి ఒక్క మొక్కయినా నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బి.జయరామిరెడ్డి, అధ్యక్షుడు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, మితికాల నారాయణ, తోట రమేష్, మెడబలిమి ముసలయ్య, రంగారెడ్డి, మున్నెల్లి తిరుపతిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కొండపి: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని కోయవారిపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బీ ప్రేమ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోయవారిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6850 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ అనిల్, అంజి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల కలయిక మధురానుభూతి



అతిథులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పామూరు: ఉపాధ్యాయుడిగా తాను పనిచేసిన పాఠశాలలోని పూర్వ విద్యార్థులతో కలవడం ఓ మధురానుభూతిని పామూరు జీహెచ్‌ఎస్ పూర్వ ఉపాధ్యాయుడు, ఒంగోలు డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్ అన్నారు. స్థానిక సత్యనారాయణస్వామి కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం పామూరు జీహెచ్‌ఎస్‌లో 1989–95 మధ్య బోధించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా చంద్రమౌళీశ్వర్ దంపతులను, ఉపాధ్యాయులు బొగ్గవరపు రాధాకృష్ణమూర్తిని, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, డి.వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించి నాటి తీపి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో గుంతలే గుంతలు



శాంతి థియేటర్ సెంటర్‌లో గుంతలమయంగా ప్రధాన రహదారి



కూరగాయల మార్కెట్ సెంటర్లో గుంతల్లో నిలిచిన నీరు

- నాసిరకం పనులతో రోడ్డు గుంతలమయం

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతూ తీవ్రగాయాల పాలవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొన్న గుంతలకు పలుసార్లు మరమ్మతులు చేసినప్పటికి నాసిరకంగా చేయటంతో చేసిన కొద్ది రోజులకే మరల గుంతలుపడ్డాయి. ఆర్టీసీ బస్టాండు, నరసింహనగర్, అడితి బజారు జంక్షన్, కూరగాయల మార్కెట్ జంక్షన్, శాంతి థియేటర్ సెంటర్, కందుకూరు రోడ్డు జంక్షన్‌లలో మార్చిలో మరమ్మతులు చేశారు. కాని మరమ్మతులు ఇష్టారాజ్యంగా చేయటంతో వర్షపునీరు పారే వీలు లేకుండా ఉండటంతో నీరు రోడ్డుపై నిలిచి గుంతలుగా మారాయి. సాయిబాబా గుడి సెంటర్, ఊళ్లపాలెం కటింగ్ వద్ద ఆర్చి దగ్గర మరమ్మతులు చేసినా మళ్లీ గుంతలు ఏర్పడగా, సాయిబాబా గుడి వద్ద వర్షపు నీరుపోయే వీలులేకుండా ఉంది. కూటమి ప్రభుత్వంలో కోట్ల నిధులు ఖర్చు చేసి పనులు నాసిరకంగా చేయటంతో రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయని, కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.